
సాక్షి నిర్మల్
బుధవారం । 28 । జూన్ । 2023



కడెం తీరం.. సోయగాల హారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కడెం నది ప్రధానమైనది. అడవుల గుండా ప్రవహిస్తూ, రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరిలో కలుస్తోంది. 8లో ▸

దివ్యాంగులకు ఉపాధి శిక్షణ

కడెం: ఎనేబుల్ ఇండియా, కెడ్రి అధ్వర్యంలో దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న, ప్రధాన కార్యదర్శి తోట్ల కాంత్రికుమార్ సూచించారు. ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఉట్నూర్ అధ్వర్యంలో పది రోజుల స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధికి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.4/25.6

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హరితహారానికి సిద్ధం



నర్సరీని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

కుంటాల: హరితహారానికి మొక్కలు సిద్ధం చేసినట్లు డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కల్లూర్ నర్సరీని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 396 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో బాధ్యతాయుతంగా మొక్కలు పెంచి సంరక్షించామన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేసి నాటి సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ప్రకృతి సేద్యంపై గిరిజన రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

కడెం: ప్రకృతి సేద్యం, సమీకృత వ్యవసాయంపై మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడ, చిట్యాల్ గొండుగూడ, కొలాంగూడ గిరిజనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యంతో కూరగాయాలు పండించే గిరిజన రైతులకు విత్తనాలు, జీవ ఎరువులు, జిగురు అట్టలు, వేప నూనె ఉచితంగా అందిస్తామని ఐటీడీఏ ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ, ఉద్యాన అధికారుల వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఖానాపూర్ క్లస్టర్ ఉద్యాన అధికారి మౌనిక, చిట్యాల్ సర్పంచ్ ఆర్కదివ్య, ఏఈవో షాలిని, రిలయన్స్ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి సంధ్య పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా మార్చుదాం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను రక్తహీన రహిత జిల్లాగా మారుద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజు అన్నారు. అనీమియా సే నిర్మల్ ముక్త్ అనే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. కౌమార దశ నుంచే పిల్లల్లో రక్తహీనత, పోషకాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల గురించి అవగాహన కల్పించి వాటిని తీసుకునే విధంగా చూడాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి హిమోగ్లోబిన్ పెరిగేలా సేవలు అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు శ్రీనివాస్, నిఖిలారాణి, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ, ఎస్‌వో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్



గెలుపొందిన విద్యార్థులు

నిర్మల్ రూరల్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలో 11 కేంద్రాలలో 163 ఉన్నత పాఠశాలల నుంచి పాఠశాలకు ఇద్దరు విద్యార్థుల చొప్పున 326 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కో పరీక్ష కేంద్రం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి పొందిన ఇద్దరికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద ఇద్దరికి రూ.4 వేలు, తృతీయ బహుమతి ఇద్దరికి రూ.3 వేల చొప్పున వారి అకౌంట్లలో ఆర్బీఐ జమ చేస్తుందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జూలై 4న జిల్లాస్థాయి క్విజ్ నిర్వహిస్తామన్నారు.

రైతుల ఖాతాల్లో రైతుబంధు

- మొదటి రోజు రూ.14.5 కోట్లు జమ

లక్ష్మణచాంద: వానాకాలం సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం మొదలైంది. ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. మొదటి రోజు సోమవారం గుంట భూమి నుంచి ఎకరంలోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. జిల్లాలో 47 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.14.5 కోట్లు జమయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ తెలిపారు. మంగళవారం రెండెకరాలలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు.



పరిశీలనకు ఉంచిన బ్యాలెట్ బాక్సులు, వీవీప్యాట్ యూనిట్లు

ఎన్నికలకు సన్నద్ధం!

- బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల చెకింగ్
- జిల్లా యంత్రాంగం సమక్షంలో పరిశీలన
- సాంకేతిక అంశాలపై అధికారులకు అవగాహన
- డబుల్ ఓట్ల ఏరివేత ప్రక్రియ ముమ్మరం

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లాలో ఎన్నికల హడావుడి అప్పుడే మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలకు మరో ఆరు నెలలు మాత్రమే సమయం ఉంది. ప్రధాన పార్టీలు గెలుపు ఓటములపై సర్వేలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు అధికార యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను ప్రారంభించింది. డబుల్ ఓట్ల ఏరివేత ప్రక్రియను కూడా ముమ్మరం చేసింది.

గోదాముల్లో భద్రపర్చిన అధికారులు.....

కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎన్నికల నియమావళి, విధులపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పరిధిలో ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు. జిల్లా పరిధిలో 981 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్మల్‌లో 2,33,248లో, ఖానాపూర్‌లో 2,05,751, ముధోల్ నియోజకవర్గ పరిధిలో 2,32,379 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను సరఫరా చేసింది. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మించిన గోదాముల్లో వీటిని భద్రపరిచారు.



ఈవీఎంలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌సీ..

జిల్లాకు 5 వేల బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను ఎన్నికల సంఘం కేటాయించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ ఎఫ్‌ఎల్సీ (ఫస్ట్ లెవల్ చెకింగ్) ప్రారంభించారు. ఈ నెల 22న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 4 వరకు అంటే 14 రోజులపాటు కొనసాగనుంది. ఇందుకోసం జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి విధులు నిర్వహించేలా నియమించారు. ఎఫ్‌ఎల్‌సీ పర్యవేక్షణ బాధ్యతను డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారిగా అదనపు కలెక్టర్ రాంబాబుకు అప్పగించారు. ఈసీఐఎల్ నుంచి వచ్చిన ఇంజినీర్లు ఓటింగ్ యంత్రాలను నేతల సమక్షంలో తనిఖీ చేస్తున్నారు.

అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా..

చట్ట ప్రకారం ఓటరు ఎక్కడైతే నివాసం ఉంటాడో అక్కడే ఓటు హక్కు కలిగి ఉండాలి. అయితే చాలామంది ఎక్కడ నివాసముంటే అక్కడ ఓటరు కార్డును పొందారు. ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిన సందర్భంలో ఓటును మార్చుకో లేదు. దీంతో ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉంటున్నాయి. ఏ నియోజకవర్గంలో ఎంత మేర జనాభా ఉంది? ఎంతమంది ఓటర్లు ఉన్నారన్నది స్పష్టం కావడం లేదు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఒక వ్యక్తికి ఒక ఓటు ఉండాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో డబుల్ ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటోంది. 2023, అక్టోబరు 4న తుదిజాబితా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో డబుల్ ఓట్లను ఏరివేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు బీఎల్వోలు గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ ఓటరు జాబితాతో వెళ్లి పరిశీలిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, గ్రామాల్లో నివాసం ఉండని వారి ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఓటర్ల ఫొటోలు స్పష్టంగా ఉండేలా కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఓటరు ఐడీకి ఆధార్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించారు.

డ్రా పద్ధతిలో డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులు డబుల్ బెడ్రూం లబ్ధిదారులను మంగళవారం ఎంపిక చేశారు. నోడల్ అధికారి డీసీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి ఆధ్వర్యంలో డ్రా తీశారు. పట్టణంలోని 12 వార్డుల నుంచి 235 మంది అర్హులను అధికారులు గుర్తించారు. వీరిలోనుంచి 74 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల కోటాతో కలిపి 74 మందిని ఎంపిక చేశామని అధికారులు ప్రకటించారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటికి సంబంధించిన పత్రాలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు చిన్నం సత్యం, తొంటి శ్రీనివాస్, పరిమి సురేశ్, జన్నారపు శంకర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో మల్లేశ్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.



ఇంటి పత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక..

పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో నిర్మించి పంపిణీకి సిద్ధంగా ఉన్న 400 ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం 1000కి పైగా దరఖాస్తులను స్వీకరించి అందులో నుంచి 708 మంది అర్హులను గుర్తించారు. కొద్ది నెలల క్రితం పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో డ్రా పద్ధతిలో 400 మందిని అధికారులు ఎంపిక చేశారు. అయితే అందులో అనర్హులు ఉన్నారంటూ ఇళ్లు రాని లబ్ధిదారులతోపాటు అఖిలపక్ష నాయకులు ఆందోళన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సైతం అధికారులు ఎంపిక చేసిన జాబితా తప్పుల తడకగా ఉందని, దీన్ని వాయిదా వేసి మరోసారి సర్వేచేయాలని తెలిపారు. కానీ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్ చేశారు. స్థానికుల ఆందోళనతో దిగివచ్చిన అధికారులు 400 మంది లబ్ధిదారుల జాబితా నుంచి 74 మందిని తొలగించారు. తొలగించిన వారి స్థానంలో గతంలో మిగిలి ఉన్న 308 మందికి సంబంధించిన వారి నుంచి 235 మందితో చివరి జాబితాను తయారు చేశారు. 235 మందిలో 74 మందిని ఎంపిక చేయగా, మరో 161 మంది మిగిలారు.

ఫోన్ పోతే.. బాధపడకండి

- ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని ఇక బాధపడనక్కర్లేదని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. https:// www. ceir. gov. in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకున్న ఫోన్లను ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఫోన్ పోతే మొదట అదే నంబర్‌తో నూతన సిమ్ తీసుకుని, వెబ్‌సైట్‌లో లాగిన్ చేసి, ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్లోడ్ చేసి, రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ అని నమోదు చేసుకోవాలని సూచించారు. తర్వాత తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. పోయిన ఫోన్‌లు వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. అయితే టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ పోయిన ఫోన్‌ను వెతికి పెట్టడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ అప్లికేషన్ గురించి పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాలలో, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీకోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్..

'పుకార్లను నమ్మొద్దు'

భైంసాటౌన్:శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో సమాచారం షేర్ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. కుంటాల మండలంలో ఇటీవల జరిగిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు చేసిన 'హమ్ బచ్చేంకా నారా హై.. తాలేంకా హక్ హమారా హై' అన్న నినాదాలను 'పాకిస్తాన్ హమారా' అన్నట్లుగా కొందరు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి పుకార్లను నమ్మొద్దని సూచించారు.

ఉచిత అంబులెన్సు ఏర్పాటు



అంబులెన్సు ప్రారంభిస్తున్న దేవేందర్‌రెడ్డి

లోకేశ్వరం: ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకే అంబులెన్సు ఏర్పాటు చేశామని నిర్మల్ జిల్లా ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి తన సొంత డబ్బులతో అంబులెన్సు కొనుగోలు చేసి మండల ప్రజల కోసం ఉచితంగా అందుబాటులో ఉంచారు. ఈమేరకు మండల కేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో అంబులెన్సును మంగళవారం ప్రారంభించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. అలాగే స్వర్గ రథాన్ని కూడా మండల ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో మండల కేంద్రానికి చెందిన దీపురెడ్డి ఇండియా తరపున ఆడి ప్రతిభ కనబర్చాడు. అతడికి రూ.25 వేల చెక్కు అందజేశారు. జెడ్పీ మాజీ చెర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీపీ బాయమోల్ల లలిత, ఎంపీటీసీలు మగ్గిడి రాణి, సర్పంచులు శైలజ, ఎల్లన్న, భూజంగ్‌రావు, నరేందర్‌రెడ్డి, నాయకులు చిన్నరావు, భోజన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధన



డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- ఆసక్తిగా వింటున్న విద్యార్థులు
- జిల్లాలో 72 ఉన్నత పాఠశాలల్లో ఏర్పాట్లు

మామడ: పాఠశాలల్లో గతంలో నల్ల బల్లలు సరిగా ఉండక పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు, బోర్డుపై ఏం రాశారో తెలియక, సరిగా కనపడక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో ఎంపికైన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తుండటంతో పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి. ప్రస్తుతం పాఠశాలల్లో డిజిటల్ పరికరాలతో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు కూడా ఆసక్తిగా పాఠాలు వింటున్నారు. జిల్లాలో మొదటి విడతలో 260 పాఠశాలలు మన ఊరు మన బడి కార్యక్రమంలో ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టారు.

టెక్నాలజీ సహకారంతో..

జిల్లాలో మొదటి విడతలో 72 ఉన్నత పాఠశాలలను డిజిటల్ బోధనకు ఎంపిక చేసి పరికరాలను అందించారు. ప్రతీ పాఠశాలలో 8, 9, 10 తరగతులకు డిజిటల్ టీవీలను అందించారు. జిల్లాలో 216 టీవీలను పాఠశాలలకు అందించి ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనపై శిక్షణ అందించారు. తెలంగాణ రాష్ట్ర టెక్నాలజికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 75 అంగుళాలు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ స్క్రీన్ ఇంటర్‌నెట్ సౌకర్యం కలిగిన డిజిటల్ పరికరాలు పంపిణీ చేశారు. ఇందులో బ్లాక్‌బోర్డు, గ్రీన్‌బోర్డు సౌకర్యం ఉంటుంది. 6 గంటలు బ్యాకప్ కలిగిన యూపీఎస్ బ్యాటరీలు అందించారు.

ప్రయోజనాలు ఇవీ..

డిజిటల్ పరికరంతో ఉపాధ్యాయులు బోధించిన అంశాలు ఫైల్‌గా మార్చుకోవచ్చు. ఇంటర్‌నెట్ ద్వారా పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించవచ్చు. ఓపీఎస్(ఓపెన్ ప్లగ్ సిస్టమ్)తో విండోస్ నేర్చుకోవచ్చు. గణితానికి సంబంధించిన కిట్‌ను పాఠ్యాంశ బోధన సమయంలో వినియోగించుకోవచ్చు. పాఠ్య పుస్తకంలోని అన్ని పాఠ్యాంశాలను క్యూఆర్ కోడ్‌ను వినియోగించి స్క్రీన్‌పై చూసి పాఠ్యాంశాలను విద్యార్థులు అర్థం చేసుకునేలా అదనపు సమాచారం కూడా అందించవచ్చు.

కఠిన అంశాలు సులభంగా..



డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాల బోధన ద్వారా విద్యార్థులు కఠినమైన అంశాలను సులభంగా అవగాహన చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధన సులభమవుతుంది. బోధనకు పాఠశాలకు అందించిన డిజిటల్ పరికరం వినియోగిస్తున్నాం.

– వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, కొరిటికల్ ఉన్నత పాఠశాల

సద్వినియోగం చేసుకోవాలి



మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన 72 ఉన్నత పాఠశాలలకు బోధనలో వినియోగించుకునేందుకు 216 టీవీలను ప్రభుత్వం అందించింది. పాఠ్యాంశాలను డిజిటల్ విధానంలో బోధించడం ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది. సందేహాలు నివృత్తి చేయడం సులభమవుతుంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

వర్షం.. హర్షం..



నిర్మల్‌లో కురుస్తున్న ముసురు

- జిల్లాలో రెండురోజులుగా ముసురు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఇప్పటికే విత్తిన పంటలకు జీవం

మండలాలవారీగా వర్షపాతం ఇలా..

మండలం	వర్షపాతం (మి.మీలలో)
కుభీర్	14.4
తానూరు	12.4
బాసర	9.2
ముధోల్	12.2
భైంసా	10.2
కుంటాల	22.6
నర్సాపూర్(జి)	15.6
లోకేశ్వరం	20.2
దిలావర్‌పూర్	17.2
సారంగపూర్	10.2
నిర్మల్	8.8
నిర్మల్ రూరల్	9.6
సోన్	10.4
లక్ష్మణచాంద	11.2
మామడ	8.4
పెంబి	25.4
ఖానాపూర్	14.2
కడెం	20.6
దస్తురాబాద్	17.2

భైంసాటౌన్/నిర్మల్‌ఖిల్లా:జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న ముసురు వానతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి జోరు వాన కురవగా సోమవారం, మంగళవారం రోజంతా జల్లులతో కూడిన ముసురు పట్టుకుంది. వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పూర్తిగా తడిసి విత్తులకు అనువుగా మారడంతో రైతులు సాగు పనుల్లో బిజీగా మారారు. పత్తి, సోయా విత్తనాలు వేసుకుంటున్నారు. ఇక, మొన్నటివరకు తీవ్రమైన ఎండలతో బెంబేలెత్తిన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం సగటు వర్షపాతం 14.2 మి.మీలుగా నమోదైంది. అధికంగా పెంబి మండలంలో 25.4 మి.మీలు, మామడలో తక్కువగా 8.4 మి.మీల వర్షం కురిసింది.



నిర్మల్‌లో బోయవాడ గల్లీ రోడ్డుపై గుంతల్లో నీరు

విత్తిన పంటలకు జీవం..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు తాజా వానలు ఊరటనిస్తున్నాయి. ఇప్పటికే విత్తిన పత్తి, మొక్కజొన్న, కంది, పెసర పంటలకు జీవం లభించింది. మరోవైపు వ్యవసాయ పనులు కూడా ఊపందుకున్నాయి. వరితోపాటు, ఇతర పంటలు వేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నార్లు పోసుకుంటున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు రైతుల్లో వానకాలం పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

'తొలకరి'కే జలమయం

జిల్లా కేంద్రంలో కురిసిన తొలకరి వర్షంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోవడంతో చిన్నపాటి వానకే పొంగి నీరు రోడ్లపైకి వస్తోంది.

క్లుప్తంగా

డ్రంకెన్‌డ్రైవ్‌లో 25మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 25మందికి జరిమానా, ఇద్దరికి మూడు, ఒక్కరికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. 25మందికి రూ.17,100 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రహేమాన్ తీర్పునిచ్చారు.

మాడిఫైడ్ సైలెన్సర్ల బైక్‌లు పట్టివేత..

జిల్లా కేంద్రంలో షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్ పెట్టుకొని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న బైకులను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా బైక్‌కు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను బిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా వారిని ఆర్టీవోకు అప్పచెప్పడంతో రూ.5వేల నుంచి రూ.10వేల జరిమానా విధిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు.

రజితపై మరో కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన తోట రజితపై మరో కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని పది మంది నుంచి డబ్బులు వసూలు చేసి జైలు పాలు కాగా ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పి.సుజాత, జీడీసీ కాలనీకి చెందిన పి.గంగామణిలు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి సుజాత నుంచి రూ.2లక్షల 25వేలు, గంగామణి నుంచి రూ.30వేలు డబ్బులు కాజేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అటవీ అధికారులకు మనుబోతు అప్పగింత



మనుబోతును ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ శివారులో మంగళవారం మనుబోతు గాయాలపాలై గ్రామస్తులకు కనిపించింది. దీంతో గ్రామస్తులు సర్పంచ్ జాదవ్ ధూమ్‌నాయక్‌కు సమాచారం అందించగా అతడు పోలీసులకు, వెటర్నరీ అధికారులకు తెలిపాడు. వెటర్నరీ డాక్టర్ రాజేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకొని మనుబోతుకు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం ఎస్సై సాయికిరణ్, గ్రామస్తులు మనుబోతును అటవీశాఖ అధికారి మహేష్‌కు అప్పగించారు.



పొచ్చర జలపాతం



కనకాయి జలపాతం



కుంటాల జలపాతం

కడెం తీరం.. సోయగాల హారం

ప్రకృతికి నిలయంగా.. నది పరీవాహకం

- గోదావరికి ఉపనదిగా...
- సాగుకు జీవ నదిగా..
- జలపాతాలకు నిలయం
- ఆదిలాబాద్ జిల్లా దక్షిణ కాశ్మీరంలో కడెం నది ఓ భాగం

కడెం నది
ప్రారంభం: ఉమార్డా(బి), ఆదిలాబాద్ జిల్లా
ముగింపు: బెల్లాల్ (పెద్దురు) నిర్మల్ జిల్లా
పొడువు: 86కిలో మీటర్లు
నదిపై ప్రధాన సాగు నీటి ప్రాజెక్టు: కడెం ప్రాజెక్టు
జలపాతాలు: కుంటాల, పొచ్చర, కనకాయి, బంద్రేవ్, గాయత్రి



కడెం ప్రాజెక్ట్ అందాలు

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా అడవులు, నదులు, జలపాతాలు, పచ్చదనం ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి. జిల్లాను దక్షిణ కాశ్మీర్‌గా పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు దక్షిణం వైపు గోదావరి నది, ఉత్తరం వైపు పెన్‌గంగా నది మధ్యలో కడెం నది పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో కడెం నది ప్రధానమైనది. కడెం నది కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రవహించడంతో ఎక్కువ భాగం అడవుల గుండా ప్రవహిస్తూ, రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరి నదిలో కలుస్తోంది. నది తీరం సాగుకు జీవం పోస్తుంది.

కడెం నది ప్రయాణం ఇలా..

మండలంలోని ఉమార్డా వద్ద ప్రారంభమై గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో నది 17కిలో మీటర్ల వద్ద కనకాయి జలపాతం, బంద్రేవ్ జలపాతం, గొలుసుల గుండం ఉన్నాయి. మరో 12కిలో మీటర్ల ప్రయాణం తర్వాత నేరడిగొండ మండలంలో కుమారి వద్ద ప్రవేశిస్తుంది. కడెం నదికి ఉపనది అయిన బోథ్ మండలంలోని పెద్ద వాగుపై పొచ్చర జలపాతం ఉంది. కుమారి గ్రామ సమీపంలోనే కడెం నదిపై రాష్ట్ర ప్రభుత్వం 5.30 టీఎంసీల నీటి సామర్థ్యంతో, మూడు మెఘవాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.1100 కోట్ల నిధులతో కుప్టీ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. అక్కడి నుంచి నది 10కిలో మీటర్లు ముందుకు వెళ్లాక కడెం నదికి ఉపనది అయిన ఇచ్చోడ మండలంలోని గుండివాగుపై గాయత్రి జలపాతం ఉంది. ఈ జలపాతం వద్ద జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. కడెం నది అక్కడి నుంచి మరో 11కిలో మీటర్లు ముందుకు వెళ్లిన తర్వాత నేరడిగొండ మండల పరిధిలో కవ్వాల అభయ అరణ్యం (టైగర్ జోన్)లో రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన, ప్రసిద్ధి చెందిన కుంటాల జలపాతం ఉంది. ఈ జలపాతానికి జులై నుంచి జనవరి వరకు రోజుకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. అక్కడి నుంచి 80కిలో మీటర్లు ప్రయాణిస్తే కడెం మండల కేంద్రం సమీపంలో కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను నిర్మించారు.

ఉప నదులు సమాహారం..

కడెం నది ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో ఉంది. నది పరివాహకం బజార్‌హత్నూర్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, సిరికొండ, కడెం, పెంబి మండలాల పరిధిలో ఉంది. కడెం నదికి బలివాగు, గాజగాపూరం వాగు, బతుకమ్మ వాగు, సిక్కుమాను వాగు, పలుకేరు వాగు, దట్కి వాగు, రాగిదోబ, గుండివాగు, వాంకిడి వాగు, పెద్దవాగు, కమ్రపద్ద వాగులు ఉపనదులు ఉన్నాయి. ఈ వాగుల పరిధిలో చెరువులు, నీటికుంటలు అనేకం.

కడెం నదీ పరీవాహకం..

కడెం నది గోదావరి నదికి ఉపనది. ఇది కడెం రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ అభయారణ్యంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం గిరిజాయి గ్రామపంచాయతీ పరిధిలోని ఉమర్డా గ్రామం వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రారంభవుతోంది. 86 కిలో మీటర్ల పొడువున ఆగ్నేయ దిశలో ప్రవహించి కడెం మండలం బెల్లాల్ గ్రామం వద్ద గోదావరి నదిలో కలుస్తుంది.



నది ప్రారంభమయ్యే స్థలం



కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను 1958–1965 మధ్యకాలంలో నిర్మించారు. ఆయకట్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68వేల ఎకరాలు సాగవుతోంది. ఈ ప్రాజెక్టులో గోదావరి నదిపై గల శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా కడెం రిజర్వాయర్‌లో నీటిని నింపుతారు. నీటి పంపిణీకి రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడువు 76.8 కిలోమీటర్లు, కుడి కాలువ పొడువు 8కిలో మీటర్లు.



కడెం ప్రాజెక్ట్‌పై భాగంలో..

జలపాతాల నిలయం..

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనటువంటి ప్రకృతి రమణీయత కడెం నది పరీవాహక ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఉన్న జలపాతాలు హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బజార్‌హత్నూర్ మండలంలోని కనకాయి, బంద్రేవ్ జలపాతాలు, బోథ్ మండలంలోని పొచ్చర, ఘన్‌పూర్ జలపాతాలు, ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతం, నేరడిగొండ మండలంలోని కుంటాల, కొరిటికల్ జలపాతాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి.



గాయత్రి జలపాతంపై ట్రెక్కింగ్ చేస్తున్న క్రీడాకారులు

పొదుపు చేస్తేనే ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న టీజీబీ చైర్మన్ శోభ, పక్కన డీఆర్‌డీవో విజయలక్ష్మి



స్వయం సహాయక మహిళలకు చెక్కు ఇస్తున్న టీజీబీ చైర్మన్ శోభ, డీఆర్‌డీవో విజయలక్ష్మి

- పొదుపులో మహిళలు ఆదర్శం
- టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ

కుంటాల: పొదుపు చేస్తేనే మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, పొదుపుతో మహిళలు ఆదర్శంగా నిలవడం గర్వకారణమని టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ, డీఆర్‌డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయ ఆవరణలో జిల్లాలోని 833 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.50 కోట్ల రుణ వితరణ చేసి మాట్లాడారు. ప్రతీ మహిళా పొదుపు సంఘంలో నెలసరి పొదుపు చేస్తే స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, వ్యాపార, విద్యారుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు పొదుపు అలవర్చుకుంటే వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉంటాయన్నారు. పొదుపు చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు. ఆర్‌ఎం బీవీఎస్ రామారావు, అడిషనల్ డీఆర్‌డీవో గోవింద్‌రావు, డీపీఎంలు జ్ఞాను, విజయలక్ష్మి, మేనేజర్లు రాంచందర్, సంతోష్, శ్రీకాంత్, ఏపీఎం భోజన్న ఉన్నారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం



కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మూగ, చెవిటి వ్యక్తి అక్రమ్ ఆచూకీ లభ్యమైనట్లు సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడు రైలులో ఎక్కి గుర్తుతెలియని చోటికి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌కు రావడంతో పోలీసులు గుర్తించి అతడి కుటుంబీకులకు అప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

తాంసి: మండల కేంద్రానికి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం విద్యుత్‌షాక్‌తో మేక మృత్యువాత పడింది. పశుగ్రాసం కోసం పంట చేల వైపు మేకలను తీసుకెళ్లే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మేక తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. మృతి చెందిన మేక విలువ రూ.10వేలకు పైగా ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని యజమాని రాజు కోరుతున్నాడు. పాఠశాల సమీపంలోని ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యుత్‌షాక్‌తో మేక మృత్యువాత పడిందని, పాఠశాల విద్యార్థులు కూడా ఇటు వైపు వచ్చే అవకాశం ఉందని, ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో చెరువులో చేపలు మృతి

దస్తురాబాద్: అనుమానాస్పదస్థితిలో మండల కేంద్రంలోని పెద్ద చెరువులోని చేపలు మంగళవారం మృతిచెందాయి. మత్స్యకారుల వివరాల ప్రకారం ... మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో యేటా చేపలను సాగు చేస్తుంటారు. రెండు రోజులుగా వర్షాలు కురువడంతో కొంత చెరువులోకి నీరు వచ్చి చేరింది. అయితే ఆ నీరు వచ్చే ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపి ఉంటారని ఆరోపించారు. ఈ చెరువులో యేటా 70,000 చేప పిల్లలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందని, గత రెండు సంవత్సరాల నుంచి చేపలను పెంచుతున్నామన్నారు. విష ప్రయోగంతో రెండు టన్నుల చేపలు చనిపోయాయని, ప్రభుత్వం మత్స్యకార సంఘ సభ్యులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అడవి తల్లికి 'తొలి' పూజ

- గిరిజన గూడేల్లో ప్రారంభమైన 'అకాడి' సంబురం
- ఊరూరా ఉత్సవాలకు శ్రీకారం
- అడవుల్లోనే వనభోజనాలు
- ఏత్మాసార్ పేన్‌కు పూజలు ప్రారంభం
- నాలుగు మాసాలపాటు కొనసాగింపు



తుర్ర మోగిస్తున్న పెద్దలు

కెరమెరి(ఆసిఫాబాద్):సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. ఆషాఢమాసంలో ముందుగా వచ్చే పండుగ అకాడి. నెలవంక కనిపించడంతో అకాడి వేడుకలు ప్రారంభించి వారం రోజులపాటు నిర్వహిస్తారు. మంగళవారం పెద్దసాకడ గ్రామంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో అకాడి పండుగ ప్రారంభించారు. పౌర్ణమి వరకూ వేడుకలు నిర్వహించనున్నారు.

వనంలో పూజలు..

అకాడి వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్దసాకడ గ్రామ పొలిమేరలో ఉన్న బాబ్రిచెట్టు వద్దకు వెళ్లారు. చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణరేఖ లాంటి ఒక గీత గీశారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుర్రను ఊదడంతో పశువులు గీతపై నుంచి అడవిలోకి పరిగెత్తాయి. అడవిలోని చెట్లు, ఆకులకు అకాడిపేన్ పూజ చేశాక ఆ ఆకులను ఇళ్లకు తీసుకెళ్లారు.

కోడితో జాతకం..

ఆదివాసీల ఆచార వ్యవహారాల్లో భాగంగా గ్రామ పటేల్ ఇంటినుంచి తెచ్చిన కోడిని దేవుడి ముందు ఉంచుతారు. దాని ముందు గింజలు పోసి జాతకం చెప్పించుకుంటారు. అనంతరం ఇంటినుంచి తెచ్చిన కోడిని బలిస్తారు. అక్కడే ఒకచోట వంటలు తయారు చేశారు.

తుర్ర వాయింపు..

ఈ అకాడి పండుగల్లో మరో కొత్త కోణం ఉంది. అడవిలోకి వెళ్లిన పశువులు ఇళ్లకు చేరాలంటే తుర్ర వాయించాలని ఆచారం. పశువుల కాపరుల వద్ద ఈ తుర్ర ఉంటుంది. పశువులు ఎక్కడికి వెళ్లినా ఈ తుర్ర వాయిస్తే తిరిగి వస్తాయని వారి నమ్మకం. నెల రోజుల పాటు తుర్ర వాయిస్తూనే ఉంటారని పలువురు కటోడాలు చెబుతున్నారు.

ఏత్మాసార్ పేన్‌కు పూజలు!

అకాడి అనంతరం గ్రామంలోకి చేరుకున్న ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేశారు. నాలుగు మాసాలపాటు ఈ పూజలు కొనసాగనున్నాయి. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు పశువులు క్షేమంగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. అకాడి అనంతరం నాగుల పంచమి, జాముర‌ావూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు చేస్తారు.

సంప్రదాయబద్ధంగా అకాడీ పూజలు

సిరికొండ: మండలంలోని కోసుగూడ గిరిజనులు మంగళవారం తమ సంప్రదాయపద్ధతిలో అకాడీ పండుగను నిర్వహించుకున్నారు. గ్రామస్తులంతా కలిసి గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్లి తమ గిరిజన దేవుళ్లతో పాటు ప్రకృతికి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమరం రావుజీ, దేవరి కుమురం జంగుబాపు, మహాజన్ కోరేంగ వాగు, కారోబారి కుమురం కోసేరావ్, కుమురం యాదవ్‌రావు, లింబరావ్ ఉన్నారు.



ఆకిపేన్ వద్ద భక్తులు



సిరికొండ: పూజల్లో గిరిజనులు

అనాదిగా వస్తున్న ఆచారం



అకాడి పండుగ అనాది నుంచి వస్తున్న ఆచారం. ఈ పండగ చేశాకే అన్ని పండుగలు చేసుకుంటాం. ఈ సందర్భంగా రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఇది ఆదివాసీల ఆచారం.

– కుర్సెంగ సోంజి, పెద్దసాకడ

ఆయురారోగ్యాలతో ఉండాలని..



ప్రజలతో పాటు, పశుపక్షాదులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగానే కోడి పంచాంగం చెబుతుంది. దాని ప్రకారమే సంవత్సర కాలమంతా నడవాల్సి ఉంటుంది.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

ఏత్మాసార్ పేన్‌కు పూజలు



అకాడి పూజల అనంతరం ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. నాలుగు మాసాల పాటు ఈ పూజలు చేయాల్సి ఉంటుంది. గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఈ రోజు మొక్కుకుంటారు. దసరా, దీపావళి తదితర పండుగలు చేస్తాం. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.

– ఆత్రం బొజ్జిరావు, సర్‌మేడి, చౌపన్‌గూడ